క్లుప్తంగా

ఎంఈఓకు సన్మానం


మధురవాణిని సన్మానిస్తున్న కార్మికులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మండల విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన మధుర వాణిని గురువారం మధ్యాహ్న భోజన కార్మికులు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి, స్వప్న, కవిత, రమాదేవి, రాజేశ్వరి, శ్రీలక్ష్మి, సత్యవతి, ధనలక్ష్మి, సీతమ్మ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోండి..

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలం కూనారం రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను ధ్వంసం చేసిన అటవీ అధికారులపై చర్య తీసుకోవాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. డివిజన్ కార్యదర్శి జాటోత్ కృష్ణ, మాచర్ల సత్యం మాట్లాడుతూ 20 ఏళ్లుగా పోడు సాగు చేసుకుంటున్నా రైతులకు పట్టాలు ఇవ్వకపోగా, వేసిన పంటను ధ్వంసం చేయడం గర్హనీయమని, పంటకు అయిన ఖర్చు చెల్లించాలని డిమాండ్ చేశారు.

బొలెరో వాహనం బోల్తా

జూలూరుపాడు: మండలంలోని పడమటనర్సాపురం గిరిజన బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో తల్లాడ–కొత్తగూడెం రాష్ట్రీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున టమాటా లోడ్‌తో వెళుతున్న బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఏపీ రాష్ట్రం అనంతపూర్ నుంచి టమాటాల లోడ్‌తో బొలెరో వాహనం కొత్తగూడెం వెళ్తోంది. పడమటనర్సాపురంలో రహదారిపై ఉన్న గుంతలను తప్పించే క్రమంలో వాహనం అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో వాహనంలోని టమాటాలు రోడ్డు పాలయ్యాయి. కాగా ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

ఎమ్మెల్యే ఆఫీస్ ముట్టడిస్తాం..


మాట్లాడుతున్న రమణమూర్తి

ఇల్లెందు: మాలలకు దాని అనుబంధ కులాలకు తీవ్ర అన్యాయం చేస్తున్న రోస్టర్ పాయింట్ 22 నుంచి 1కి తగ్గించాలని, జీఓ 99 వెంటనే రద్దు చేయాలని, రోస్టర్ విధానం రద్దు చేయాలని జాతీయ మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు తోటమల్ల రమణమూర్తి డిమాండ్ చేశారు. గురువారం ఇల్లెందులో సంఘం సమావేశంలో మాట్లాడుతూ 8న రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించాలని, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలు ముట్టడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాల్మన్‌రాజ్, అబ్బూరి సునీల్, పీజే సుందరం , కమలాకర్, రామకృష్ణ, బాబూరావు, శ్రీనివాస్, సుందర్‌పాల్, ప్రభుదాస్, నరసయ్య, దేవరాజ్, దాస్ పాల్గొన్నారు.

కష్టానికి తగిన ఫలితం

- ఏళ్ల తరబడి సంస్థ అభివృద్ధికి కృషి
- పలువురికి పదోన్నతులు, సత్కారాలు


కార్మికులకు ఉత్తర్వులు అందజేస్తున్న జీఎం శాలేంరాజు (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి వారిని కొంతమేర సంతృప్తి పరచడం సంస్థ బాధ్యత. దానిలో గనులు, డిపార్ట్‌మెంట్లలో పనిచేసే ఉద్యోగులకు ప్రతీ 6, 7 సంవత్సరాలకు ఒకసారి పదోన్నతులు కల్పించటానికి మూడు పద్ధతులు ఉన్నాయి.

వాటి ద్వారా కార్మికులకు/ఉద్యోగులకు సెప్టెంబర్ 2025 నాటికి అర్హత కలిగిన వారికి క్యాడర్ స్కీమ్/టైమ్ బాండ్ ప్రకారంగా ప్రమోషన్లు ప్రతీ సంవత్సరం మార్చి/సెప్టెంబర్‌లో క్యాడర్ స్కీమ్ ప్రమోషన్లు అందిస్తుంది.

మూడు రకాలుగా పదోన్నతులు..

సింగరేణిలో సంస్థలో రెండు రకాల ఉద్యోగులు ఉంటారు. వారిలో ఒక వర్గం ఎగ్జిక్యూటివ్స్ (అధికారులు), కార్మికులు నాన్ ఎగ్జిక్యూటివ్స్ వీరినే నేషనల్ కోల్ వేజేస్ అగ్రిమెంట్ (ఎన్‌సీడబ్ల్యూఏ) ఎంప్లాయిస్‌గా పరిగణిస్తారు. వీరికి మూడు రకాలుగా పదోన్నతులు కల్పించాలని తన స్టాండింగ్ ఆర్డర్‌లో పొందు పరిచిన అంశాల్లో ఒకటి. అయితే సంస్థలో ఖాళీలు ఏర్పడినప్పుడు పదోన్నతి కల్పించే విధానం . రెండోది సర్వీస్ లింక్‌డ్ ప్రమోషన్ (ఎస్ఎల్‌పీ) నిర్ణీత సర్వీసు పూర్తి చేసిన తరువాత ఇచ్చే పదోన్నతి (క్యాటగిరి పెంపు విధానం) మూడోది వారు చేసే పనిలో నైపుణ్యం వచ్చిన తరువాత క్యాడర్ స్కీమ్ ద్వారా కల్పించే పదోన్నతి విధానం.

356 మందికి పదోన్నతులు...

సింగరేణి సంస్థలో పనిచేసే ఉద్యోగులకు వారి నియామక సంవత్సరాన్ని బట్టి వారికి ప్రతీ ఏడు సంవత్సరాలకు పదోన్నతి కల్పిస్తుంది కంపెనీ. ఇదే క్రమంలో 356 మంది కార్మికులకు సెప్టెంబర్ 1న సర్వీస్ లింక్‌డ్ ప్రమోషన్ క్రింద పదోన్నతి పత్రాలు అందజేసింది.

వివిధ ఏరియాల్లో పదోన్నతి పొందిన కార్మికులు...

కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలో–31, కొత్తగూడెం ఏరియాలో–35,

ఇల్లందు ఏరియాలో–13, మణుగూరు ఏరియాలో–26, ఆర్జీ–1లో–26, ఆర్జీ–2లో 41, ఆర్జీ–3 ఏరియాలో–16, భూపాలపెల్లి ఏరియాలో–42, శ్రీరాంపూర్ ఏరియాలో–68, మందమర్రి ఏరియాలో–40, బెల్లంపెల్లి ఏరియాలో–11, ఎస్టీపీపీలో–7 గురు మొత్తం 356 మంది.

పనిని గుర్తించి పదోన్నతి ఇచ్చారు...



2012లో సింగరేణి సంస్థలో చేరాను. సుమారు 13 ఏళ్లకు రెండు పర్యాయాలు పదోన్నతి పొందాను అంటే, తను సంస్థ అభివృద్ధికి చేసిన కృషికి, అంకితభావంతో చేసిన పనిని కంపెనీ గుర్తించి పదోన్నతి కల్పించింది. ఇక మరింత ఉత్సాహంతో పనిచేస్తూ సంస్థ అభివృద్ధికి నావంతు తోడ్పడతా.

– చెరిపెల్లి జనార్దన్, సీనియర్ అసిస్టెంట్

లాభాల వాటా అమలు చేయాలి..



సింగరేణి సంస్థ ప్రొడక్షన్, నాన్ ప్రొడక్షన్ వారికి సమాన క్యాడర్ స్కీమ్‌ను అమలు చేస్తోంది. లాభాలా వాటా విషయంలో అమలు చేస్తున్న పాలసీని పదోన్నతుల విషయంలో అమలు చేస్తే బాగుంటుంది. ఈ విషయంలో సంస్థలకు ప్రాతినిధ్య సంఘం నాయకులు తెలిజేసి కార్మికులను ఉత్సాహపరచాలి.

– ఎస్.వినయ్, గ్రేడ్–1 క్లర్క్

అంకితభావంతో పనిచేయాలి...



ఉద్యోగులకు పదోన్నతులు కల్పించటం, సంక్షేమ కార్యక్రమాలు కల్పించటం కంపెనీ బాధ్యత. ప్రమోషన్‌తోపాటు బాధ్యతలూ పెరుగుతాయని కార్మికులు గమనించాలి. అంకితభావంతో విధుల్లో నైపుణ్యం పెంచుకోవాలి. రక్షణతో కూడిన ఉత్పత్తి చేస్తూ, కంపెనీ అభివృద్ధికి కృషి చేయాలి.

– శాలేంరాజు, ఏరియా జీఎం

లాభాల వాటా కోసం 15న ధర్నా


మాట్లాడుతున్న రాజారెడ్డి

కొత్తగూడెంఅర్బన్: 35 శాతం లాభాల వాటా, సొంతింటి కల, పని స్థలాల్లో మారుపేర్లు, నివాస ప్రాంతల్లో సమస్యల పరిష్కారం, సొంతిల్లు/కంపెనీ క్వార్టర్ డిమాండ్లపై ఈనెల 11, 12 తేదీల్లో మైన్స్–డిపార్ట్‌మెంట్లలో బ్యాలెట్ ఓటింగ్, 15న అన్ని జనరల్ మేనేజర్ల కార్యాలయాల ఎదుట ధర్నా జయప్రదం చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. గురువారం జేవీఆర్ ఓసీ పిట్ మీటింగ్‌లో బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యలు పరిష్కరించటంలో ఏఐటీయూసీ విఫలం అయిందన్నారు. పోరాటాల ద్వారానే సింగరేణిలో హక్కుల రక్షణ సాధన జరుగుతుందని, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వై.వెంకటేశ్వరరావు, గడల నరసింహారావు, పిట్ కార్యదర్శి సంపత్, పిట్ అసిస్టెంట్ కార్యదర్శి కార్తిక్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి దిగుమతి సుంకాలను తగ్గించొద్దు..


తహసీల్‌లో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: పత్తి దిగుమతి సుంకాలను తగ్గించొద్దని కోరుతూ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఆధ్వర్యంలో గురువారం తహసీల్‌లో వినతిపత్రం అందజేశారు. తుపాకుల నాగేశ్వరరావు, నాయిని రాజు, ఆలేటి కిరణ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ నూతన మార్కెటింగ్ విధానం, ట్రంప్ చేసుకున్న వాణిజ్య ఒప్పందాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పత్తి దిగుమతి సుంకాలను తగ్గించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. స్వామినాథన్ సిఫారసులను అమలు చేయాలని, పత్తి క్వింటాకు రూ.10,075 చెల్లించాలని, అన్నిరకాల పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రాసుద్దీన్, కొక్కు సారంగపాణి, బుర్ర వెంకన్న, రేసు బోసు, కల్తి సీతారాములు, శ్రీరాంకోటయ్య, మండల వెంకన్న, జూకంటి గాంధీ, పందిర్లపల్లి వీరన్న, గూళ్ల సదయ్య, తేజావత్ లాలు, దేవుల తదితరులు పాల్గొన్నారు.

డీజేలకు అనుమతి లేదు..


మాట్లాడుతున్న డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెంటౌన్: వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించేందుకు మండపాల నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని, డీజేలకు అనుమతి లేదని, అదేవిధంగా మిలాద్ ఉన్ నబీ పండుగకు ముస్లింలు, వినాయక నవరాత్రులు పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. గురువారం కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో సీఐ ఎం.కరుణాకర్ ఆధ్వర్యంలో వినాయక మండప నిర్వాహకులు, ముస్లిం మత పెద్దలతో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. 6న నిర్వహించనున్న గణేష్ శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని చెప్పారు. 5న జరగాల్సిన మిలాద్ ఉన్ నబీ కార్యక్రమాన్ని 14న జరుపుకుంటామని ముస్లిం పెద్దలు తెలియజేసినందుకు, మత సామరస్యాన్ని పాటిస్తున్నందుకు అందరికీ అభినందనలు అన్నారు.

పదోన్నతుల ఉత్తర్వులు అందజేత

ఇల్లెందు: ఇల్లెందు ఏరియా సింగరేణి ఉద్యోగులకు పదోన్నతుల ఉత్తర్వులను గురువారం ఏరియా జీఎం వీసం కృష్ణయ్య అందజేశారు. 1వ తేదీ నాటికి అర్హత కలిగిన వారికి కేడర్ స్కీం, టైం బాండ్ ప్రమోషన్లు ఇవ్వడం జరిగిందని జీఎం తెలిపారు. అందులో భాగంగా 13 మంది ఉద్యోగులు అర్హత సాధించినట్లు చెప్పారు. ఎస్ఓటూజీఎం రామస్వామి, అధికారులు గిరిధర్‌రావు, తుకారం, జాకీర్ హుస్సేన్, రామ్మూర్తి, రాందాస్, శివప్రసాద్, నాగేశ్వరరావు, సుమలత పాల్గొన్నారు.

శోభాయాత్రలో లోటుపాట్లు ఉండొద్దు..


సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు: గణేషుడి శోభాయాత్ర నిర్వహణలో లోటుపాట్లు ఉండరాదని, అపశ్రుతులకు అస్కారం ఇవ్వొద్దని, నిమజ్జనం ప్రశాంతంగా సాగాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య అధికారులను ఆదేశించారు. గురువారం ఇల్లెందు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షంలో మున్సిపల్, పోలీస్, విద్యుత్ శాఖ అధికారులకు తగు సలహాలు సూచనలు చేశారు. గత ఏడాది నిమజ్జనం చేసిన సత్యనారాయణపురం దర్గా వెళ్లే రహదారిలో ఓ ప్రైవేట్ కుంటలో నిమజ్జనం చేయాలని నిర్ణయించారు. పట్టణంలో 196 విగ్రహాలు ఉన్నట్లు పోలీస్ రికార్డులను బట్టి నిర్ధారించారు. అంతేగాక మండల వ్యాప్తంగా మరో 50 విగ్రహాలు ఉండే అవకాశం ఉందని, భద్రాచలం వెళ్లేవారు మినహా 50 విగ్రహాలు సత్యనారాయణపురం కుంటలో వేసే అవకాశం ఉంటుందని చెప్పారు. పాత బస్టాండ్ సెంటర్‌లో స్టేజీ నిర్మాణం చేయాలని, 6న నిమజ్జనం చేపట్టాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ చంద్రభాను, మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కమిషనర్ శ్రీకాంత్, సీఐ టి.సురేష్, దానియేల్, పులి సైదులు, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, గందె సదానందం, చిల్లా శ్రీను, ఉత్సవ కమిటీ సభ్యులు కె. సంజీవరెడ్డి, డీకే శ్రీను, మేనేజర్ అంకుషావలీ, డీఈ మురళీ తదితరులు పాల్గొన్నారు.

పాలకులకు దూరదృష్టి లేదు..


ఏఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: యూరియా కొరతను నివారించాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో గురువారం వ్యవసాయశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ డోర్‌కు అటించి నిరసన తెలిపారు. నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, చంద్ర అరుణ, బ్రహ్మచారి మాట్లాడుతూ.. పంటలు ఎదుగుతున్న తరుణంలో యూరియా లభించక పంటలు చేతికి రావని రైతులు కన్నీళ్ల పర్యంతమవుతున్నారని వాపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీజన్ ప్రారంభంలో ఎరువుల లభ్యతపై దృష్టి సారించకపోవడం వల్లే ప్రస్తుతం రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. పాలకులు తమ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు రైతులపై ఆరోపణలు చేయడం విచారకరమన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి యూరియా సరఫరాపై దృష్టి సారించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పక్షాల నాయకులు నాయిని రాజు, బుర్ర వెంకన్న, రాసుద్దీన్, సారంగపాణి, నబీ, ఆలేటి కిరణ్, బోస్, యాకూబ్ షావలీ, శ్రీరాంకోటయ్య, గూళ్ల సదానందం, గాంధీ, లాలు, గోపాల్ పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ కమిటీలో స్థానం కల్పించండి..

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ విద్యా విధానంలో మార్పులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎడ్యుకేషన్ పాలసీ కమిటీలో ముస్లిం విద్యావంతులకు కూడా స్థానం కల్పించాలని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఎండీ యాకూబ్ పాషా గురువారం ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ విద్యా విధానాన్ని అమలు చేయడంలో, ఉద్యోగ అవకాశాలు, విద్యా నైపుణ్యం, డిజిటల్ విద్యా విధానం, కొత్త ఆవిష్కరణలు వంటి పలు అంశాలు అధ్యయనం చేయడానికి చైర్‌పర్సన్‌తో పాటు ఆరుగురు సభ్యులను నియమించగా, ముస్లింలకు స్థానం దక్కలేదని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 14 శాతం ముస్లిం జనాభా, అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ద్వితీయ భాషగా ఉర్దూ ఉండడంతో రాష్ట్రంలోని ముస్లిం విద్యావంతులకు అవకాశం కల్పిస్తే, మారుతున్న స్థితిగతులకు అనుగుణంగా, ముస్లిం సమాజం కూడా సాంకేతిక లక్ష్యాలను అధిగమిస్తుందని అభిప్రాయపడ్డారు.

ఇఫ్టూ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

టేకులపల్లి: కాంట్రాక్ట్ , అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, వారికి చట్టబద్ధ హక్కులు, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టూ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 7న సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ రాసుద్దీన్, రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు టేకులపల్లిలోని సింగరేణి కాలనీలో వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. మాట్లాడుతూ సింగరేణి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రామారావు, శివయ్య, బాలు, రాంబాబు, కౌసల్య, ఎర్రమ్మ, నాగమణి, షఫీ, ప్రసాద్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

1వ తేదీనే వేతనాలు చెల్లించండి..


సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

కొత్తగూడెంఅర్బన్: సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించాలని సంఘం జిల్లా అధ్యక్షులు భూక్యా మోహన్ అన్నారు. గురువారం డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ విద్యాశాఖ సమగ్రశిక్షా అభియాన్‌లో 590 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని, వీరిలో జిల్లా కార్యాలయంలో పర్యవేక్షకులు, సీనియర్ సహాయకులు, జూనియర్ సహాయకులు, కోఆర్డినేటర్‌లు, కేజీబీవీ సిబ్బంది, యూఆర్ఎస్ సిబ్బంది, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఐఈఆర్‌పీలు, పీఆర్పీలు, పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు, మెసెంజల్లు పనిచేస్తున్నారని తెలిపారు. ప్రతీనెల ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పాటుగా 1వ తేదీన వేతనాలు చెల్లించాలని, ఇప్పటి వరకు ఏ ఒక్క నెలలో కూడా మొదటి తేదీన జీతాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బట్టు చందర్‌లాల్, పి.సిద్ధయ్య, ప్రవీణ్, వెంకటరమణ, శ్రావణి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నిరంతర జ్ఞానప్రదాతలు


ఇల్లెందు: స్వయం పాలన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: భావిభారత పౌరులను తయారు చేసే నిత్య శ్రామికులు, నిరంతర జ్ఞానప్రదాతలు ఉపాధ్యాయులు అని మాజీ వార్డు కౌన్సిలర్ రుక్మాంగధర్‌బండారి అన్నారు. గురువారం కొత్తగూడెంలోని కూలీలైన్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలోని ఉపాధ్యాయులను సన్మానించారు. మాట్లాడుతూ.. సమాజంలో తల్లిదండ్రుల తరువాత స్థానం గురువులకే ఉంటుందన్నారు. హెచ్ఎం తేజునాథరెడ్డి, చైర్మన్ మునిగ సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీరామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

లక్ష్మీదేవిపల్లిలోని శ్రీరామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని గురువారం ముందస్తుగా గురుపూజోత్సవం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన వ్యక్తి సర్వేపల్లి రాధాకృష్ణన్ అని కొనియాడారు. విద్యార్థులు అధ్యాపకులుగా స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు.

శిష్యుల విజయమే గురువులకు బహుమానం

ఇల్లెందురూరల్: శిష్యుని విజయమే గురువుకు నిజమైన బహుమానమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య అన్నారు. మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం గురుపూజోత్సవం నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. విద్యార్థులలో ప్రతిభను వెలికితీసి వారిని ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడం ఉపాధ్యాయుని బాధ్యత అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్ రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వయం పాలన దినోత్సవం

ఇల్లెందు: జేకే సింగరేణి ఉన్నత పాఠశాలలో గురువారం స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం, గురుపూజోత్సవం సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా పాఠశాలను నడిపించారు. కరస్పాండెంట్, డీజీఎం పర్సనల్ తుకారాం, హెచ్ఎం శ్రీనివాస్‌రావు, బి. శ్రీనివాస్‌రావు, ఏ శ్రీనివాస రావు, ఉపాధ్యాయులు నరసమ్మ, విష్ణుప్రియ, రవీందర్, ధనలక్ష్మీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టేకులపల్లి: ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవం శుక్రవారం సెలవు రావడంతో గురువారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టేకులపల్లి ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం ఎం .మోహన్‌రావు, ఉపాధ్యాయులు మసూద్ ఆలీ, రంగారావు, సురేష్,చంద్రసింగ్, స్వరూపా, రాణి, సీతమ్మ, భారతి, రవిందర్, శేఖర్, లెనిన్ బాబు, పద్మావతి, పుష్పావతి, శేషగిరి, బషీర్, కోటేశ్వర్ రావు, ప్రవీణ్, రంజితాదేవి, రాజేష్, రామక్క పాల్గొన్నారు.


కొత్తగూడెంఅర్బన్: కూలీలైన్ పాఠశాలలో..


ఇల్లెందురూరల్: డిగ్రీ కళాశాలలో..


టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

జయజయ శుభకర వినాయకా..!


కొత్తగూడెంటౌన్: రామవరం నుంచి భద్రాచలం బయలుదేరిన గణేష్ విగ్రహం

కొత్తగూడెంటౌన్: రామవరం వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడుని భక్తుల జన సందోహం మధ్య గురువారం ఊరేగింపుగా నిమజ్జనానికి భద్రాచలం తరలించారు. తొమ్మిది రోజుల పాటు మండపాల్లో భక్తుల పూజలను అందుకున్న గణనాథుడికి భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. భక్తులు భారీగా తరలిరావడంతో రామవరం మార్కెట్‌లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం రైటర్‌బస్తీ కాళికామాత దేవాలయం వద్ద బ్రదర్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక మండపంలో గురువారం అన్నదాన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఆళ్ల మురళీ, నాగేంద్ర త్రివేది, జేబీ శౌరి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఆధ్యాత్మిక మార్గంలో ఉన్న వారికి అన్నదానం ఒక పవిత్రమైన అర్పణగా భావించడం భారతదేశంలో కొన్ని వేల సంవత్సరాలుగా ఉన్న గొప్ప సంస్కృతి అన్నారు. శేఖర్, బండి భాస్కర్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాల్లో తొమ్మిది రోజులుగా భక్తుల నుంచి విశేష పూజలు అందుకున్న గణేష్ విగ్రహాలను గురువారం భద్రాచలం గోదావరి నదిలో నిమజ్జనం చేసేందుకు తరలించారు. అదేవిధంగా పలు గ్రామాల్లోని గణేష్ మండపాల వద్ద అన్నదానం నిర్వహించారు. వెంగన్నపాలెంలోని గణేష్ మండపం వద్ద జరిగిన అన్నదాన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు మాలోత్ మంగిలాల్ నాయక్ తదితరులు హాజరయ్యారు. ఎస్ఐ బాదావత్ రవి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఇల్లెందురూరల్: మండలంలోని బాలాజీనగర్ గణపతి మండపంలో మహిళలు గురువారం విశేషంగా పూజ చేశారు. ఇంటికి దిష్టి నివారణ కోసం కూష్మాండ పూజ చేయడంతోపాటు విఘ్నేశ్వరునికి 108 రకాల నైవేద్యాలతో ప్రత్యేక పూజ చేసి తరించారు. పలు గ్రామాలలో గణపతి మండపాల వద్ద భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

టేకులపల్లి: మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లోని వినాయక మండపాల్లో తొమ్మిదోరోజు గురువారం ప్రత్యేక పూజా కార్యాక్రమాలు నిర్వహించారు. టేకులపల్లి బస్టాండ్ సెంటర్‌లో మహా అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చిన అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. టేకులపల్లి ముత్యాలమ్మ బజారు, బోడు, ఒడ్డుగూడెం, లాక్యాతండా, బోడుకొత్తగూడెం, కోయగూడెం, కొత్తతండా(పి) తదితర గ్రామాల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. కోయగూడెంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రత్యేక పూజలు చేశారు.


ఇల్లెందురూరల్: బాలాజీనగర్‌లో పూజ చేస్తున్న మహిళలు


టేకులపల్లి బస్టాండ్ సెంటర్‌లో అన్నదానం


జూలూరుపాడు: కాకర్లలో గణేష్ శోభాయాత్ర